సాక్షి
ఆదిలాబాద్

ఆదివారం । 4 । మే । 2025

రైలు ఎక్కేద్దాం.. భారత్ చుట్టేద్దాం

వేసవి సెలవులు వచ్చేశాయి. నరదాగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించాలనుకుంటారు. ఈ మేరకు రైల్వే శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందిస్తోంది.



IIలో▸



రైతుల అరిగోస..! IIIలో▸

అరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు. మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

గరిష్టం/కనిష్టం
40.0/26.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో తోడ్పడుతుందన్నారు. రాజీపడదగ్గ కేసులన్నింటినీ ఇందులో పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ సీహెచ్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

ఇచ్చోడ: సమయపాలన పాటించని వైద్యసిబ్బందిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ఇచ్చోడ, గుడిహత్నూర్ ఆరోగ్య ఉపకేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అవసరమైన మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారులతో పాటు సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు.అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఎన్‌సీడీ అధికారి శ్రీధర్, వైద్యాధికారులు శ్యామ్‌సుందర్, మధురిమ ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కైలాస్‌నగర్: జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే, ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. వేసవి ముగిసే వరకు తేలికైన తెల్లటి దుస్తులు ధరించాలని, మధ్యాహ్న వేళలో బయటకు వెళ్లకుండా నీడపట్టున ఉండాలని సూచించారు. వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు.వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు



ప్రయాణికులకు కీచైన్స్ అందిస్తున్న డీఎం

ఆదిలాబాద్: ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అందిస్తున్న మెరుగైన సేవలను తెలియజేయాలనే ఉద్దేశంతోనే కీచైన్స్ పంపిణీ చేస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణికులకు శనివారం క్యూఆర్ కోడ్ కీచైన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ అందిస్తున్న సేవలు, సమగ్ర సమాచారాన్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ పోశెట్టి, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్, దేవిదాస్, పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తూ..

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి దేవేందర్ కోరారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ సీవీఎన్ రాజును శనివారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికులు ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో యూనియన్ నాయకులు అశోక్, ఉషన్న, నరేందర్ తదితరులున్నారు.



బస్టాండ్ ఎదుట ఫుట్‌పాత్‌పై, చెట్టుకింద కూర్చుని మద్యం తాగుతున్న మందుబాబులు



రవితేజ హోటల్ సమీపంలో ఆటోలో మద్యం సేవిస్తున్న మందుబాబులు



దస్నాపూర్ లోని వైన్స్ ఎదుట మందుబాబుల సిట్టింగ్

రోడ్లపైనే సిట్టింగ్!

మందుబాబులు ఎక్కడపడితే అక్కడే సిట్టింగ్ చేస్తున్నారు. వాటర్‌బాటిల్స్, ప్యాకెట్లు.. గ్లాస్‌లు, కార పొట్లాలతో రోడ్లపైనే కూర్చుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం సేవిస్తున్నారు. తీరా తాగిన తర్వాత ఆ బాటిళ్లను పగులకొడుతూ నానా హంగామా సృష్టిస్తున్నారు. దీంతో ప్రధానంగా మహిళలు, యువతులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మందుబాబులు రోడ్లను ఆనుకునే తాగుతూ అటుగా వెళ్లే వారిని టార్గెట్ చేస్తున్నారు. గొడవలకు సైతం దిగుతున్నారు. యువతులు, మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదండోయ్. సాక్షాత్తు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే ఈ ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు పట్టణంలో మందుబాబుల వీరంగం అంతా ఇంతా కాదు. ఇప్పటికే ఎస్పీ అఖిల్ మహాజన్ ఇలాంటి వారిపై కొరడా ఝుళిపిస్తున్నా కొంతమంది తీరులో మాత్రం మార్పు రావడం లేదు. శనివారం 'సాక్షి' జిల్లా కేంద్రంలోని పలు వైన్స్‌ల సమీపంలో విజిట్ చేయగా మందుబాబులు రోడ్లపైనే తాగుతూ, ఊగుతూ దర్శనమిచ్చారు. – ఆదిలాబాద్‌టౌన్

- వైన్స్‌ల ఎదుటే అడ్డాలు
- వాహనదారులకు ఇబ్బందులు
- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం
- తాగుతూ..ఊగుతూ మందు బాబుల హంగామా
- 'సాక్షి' విజిట్‌లో తేటతెల్లం

జిల్లా కేంద్రంలోని పలు వైన్స్‌ల ఎదుట మందుబాబులు సిట్టింగ్ చేస్తున్నారు. పర్మిట్ రూంలు ఉన్నా వాటిలోకి వెళ్లకుండా రోడ్డుపైకి వస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్ పక్కనగల వైన్స్‌ఎదుట గల ఫుట్‌పాత్‌పై నిత్యం మద్యం సేవిస్తూనే కనిపిస్తున్నారు. చెట్ల మధ్యలో కూర్చుంటూ పని కానిచ్చేస్తున్నారు. అలాగే రవితేజ హోటల్ సమీపంలోని వైన్స్ వద్ద కూడా ఇదే పరిస్థితి. అక్కడి రోడ్డుతో పాటు ఇసుక, కంకర కుప్పలపై కూర్చుని బహిరంగంగా మద్యం తాగుతున్నారు. దస్నాపూర్‌లోని ఎదురెదురుగా ఉన్న వైన్స్‌ల ముందైతే పరిస్థితి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. సాయంత్రం ఏడు అయిందంటే చాలు పర్మిట్‌రూంలను వదిలి మందుబాబులు ఏకంగా రోడ్డు పక్కనే అడ్డాగా మార్చుకుంటున్నారు. పంజాబ్‌చౌక్‌లోని వైన్స్, వినాయక చౌక్, ఎన్టీఆర్ చౌక్‌లోని వైన్స్‌ల ఎదుట మందుబాబుల హంగామానే కనిపిస్తోంది. తాగిన మత్తులో ఒకరికొకరు గొడవలు పడి దాడులకు పాల్పడుతున్న సంఘటనలూ ఉన్నాయి. ప్రధానంగా వినాయకచౌక్‌లోని వైన్స్ ఎదుట మందుబాబులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్‌చేస్తున్నారు. మరోవైపు ఇక్కడే సాత్నాల బస్టాండ్ ఉండటం, ఈ మార్గం గుండానే పలు గ్రామాలకు, పట్టణంలోని పలు కాలనీలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే సాయంత్రం తర్వాత ఇటువైపు నుంచి వెళ్లేందుకు మహిళలు, యువతులు జంకుతున్నారు. ఇవే కాకుండా పట్టణంలోని పలు పాఠశాలల్లోని ఆవరణలు, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, రాంలీలా మైదాన్, ప్రభుత్వ డైట్ కళాశాల మైదానం, ఎరోడ్రమ్, ఖానాపూర్ చెరువుకట్ట, అంకోలి, తంతోలి వెళ్లే రోడ్డు మార్గం, తిర్పెల్లి హైవే పక్కన, సీసీఐ సమీపంలో, మావలకు వెళ్లే మార్గంలోని పలు ప్రదేశాలు సాయంత్రం కాగానే మందుబాబులకు అడ్డాలుగా మారిపోతున్నాయి.



ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్

నేడు నీట్

- పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- అరగంట ముందు వరకే కేంద్రాల్లోకి అనుమతి

కైలాస్‌నగర్: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,659 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలోనే ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచనున్నారు. ఆయా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలుతో పాటు పకడ్బందీ బందోబస్తు నియమించనున్నారు. జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాల్లో ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షాతో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరీక్ష కేంద్రాలివే..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల భుక్తాపూర్, ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆర్ట్స్, కామర్స్, బంగారిగూడ తెలంగాణ మోడల్ స్కూల్‌తో పాటు తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

భూభారతి పైలట్ మండలంగా భోరజ్

- రేపటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ రాజర్షి షా



గూగుల్‌మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: భూభారతి నూతన రెవెన్యూ చట్టం అమల్లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలోని భోరజ్ మండలాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోరజ్ మండలంలో 28 గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిర్వహణ కోసం మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుల్లో భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గ్రామానికి వెళ్లే ముందు రోజు గ్రామస్తులకు తెలిసేలా టామ్ టామ్ వేయించాలన్నారు. సంబంధిత అధికారులు ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్‌లో ఉన్నవారు, పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. హైకోర్టు అనుమతులు రాగానే సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని, ఈమేరకు అవసరమైన కార్యాచరణ పూర్తిచేయాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్లు, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు బైకులివ్వొద్దు

- నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కేసు
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: మైనర్లకు బైక్‌లు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బైక్‌లు నడుపుతూ పట్టుబడ్డ మైనర్ల తల్లిదండ్రులకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పద్దెనిమిదేళ్లలోపు వారికి బైక్‌లిస్తే వాహన యజమానితో పాటు తల్లిదండ్రులు కేసుల పాలవుతారన్నారు. ఒకవేళ మైనర్ ప్రమాదానికి కారణమైతే ఇన్సూరెన్స్ సైతం రాకుండా పోతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రిపూట, రోడ్లపై అనవసరంగా తిరగకుండా గమనించాలన్నారు. ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 295 మంది మైనర్లు బైక్‌లు నడుపుతూ పట్టుబడగా ఆ వాహనాలను సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు సీహెచ్ కరుణాకర్, ప్రణయ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి మురళి, బి శ్రీపాల్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రతీ శనివారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించే పరేడ్, యోగా కార్యక్రమాలను ఈ వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరేడ్ నిర్వహణ ద్వారా సత్సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. ఆయుధాల వినియోగం, ట్రాఫిక్ సిబ్బందికి సిగ్నల్స్‌పై శిక్షణనిచ్చారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు బి.సునీల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్, కే.ఫణిధర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి.మురళి, బి.శ్రీపాల్, ఎస్.చంద్రశేఖర్, మావల ఎస్సై వి విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

- టెండర్లు పూర్తయినా మరూ కాని 'అమృత్–2'
- ఎస్టీపీల స్థల సేకరణలో తీవ్ర జాప్యం
- జిల్లా కేంద్రంలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణాల తీరిది

నిధులు సరే.. పనులెప్పుడో?



ఆదిలాబాద్ రూరల్ మండలం కచ్‌కంటి సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మురుగునీటి సమస్య పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం అమృత్–2 పథకం కింద రూ.225 కోట్ల నిధులు మంజూరు చేసింది. సంబంధించిన టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయిఎనిమిది నెలలవుతుంది. అయినా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. మురుగునీటిని శుద్ధి చేసే (ఎస్టీపీ) నిర్మాణాలకు అవసరమైన స్థలాల సేకరణ సమస్యగా మారింది. ఫలితంగా నిధులు ఉండి కూడా పనుల ప్రారంభంలో జాప్యమవుతోంది.

భూసేకరణే ప్రధాన సమస్య..

జిల్లా కేంద్రంలో అయిదు చోట్ల సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లను నిర్మించాలని నిర్ణయించారు. చిల్కూరిలక్ష్మీనగర్‌లో 24 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఆరు ఎకరాల్లో, ఖానాపూర్ చెరువులోనే ఎకరం విస్తీర్ణంలో 4 ఎంఎల్‌డీల సామర్థ్యం, కేఆర్‌కే కాలనీలో 1.5 ఎంఎల్‌డీల సామర్థ్యంలో 1.5 ఎకరం స్థలంలో, ఇందిరమ్మ కాలనీ, బంగారుగూడ కాలనీల్లో ఒక్కో ఎంఎల్‌డీ సామర్థ్యంతో కూడిన ఎకరం విస్తీర్ణంలో వీటిని నిర్మించాలని నిర్ణయించారు. ఖానాపూర్ చెరువులో నిర్మించనుండగా దీనికి ఎలాంటి స్థల సమస్య లేదు. మిగతా నాలుగు చోట్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించినప్పటికీ భూ సేకరణ కొలిక్కి రావడం లేదు. దీంతో పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాల అవసరం లేకుండా..

భవిష్యత్తులో ఇళ్లలో సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాల అవసరం లేకుండా ఈ పథకాన్ని రూపొందించారు. చిల్కూరిలక్ష్మీనగర్‌లో నిర్మించే ఎస్టీపీకి పట్టణంలోని దుర్గానగర్ కాలనీలోని వాగు పక్క నుంచి దస్నాపూర్, టీచర్స్‌కాలనీ, న్యూ హౌసింగ్‌బోర్డు, సుభాష్‌నగర్ మీదుగా వెళుతున్న వాగు ఇరు పక్కల ప్రధాన పైపులైన్ లేదా భారీ డ్రెయినేజీ నిర్మించనున్నారు. టైలర్స్ కాలనీ వద్ద రెండు లైన్లను ఒకే లైన్‌గా మార్చి నేరుగా చిల్కూరిలక్ష్మీనగర్‌లో నిర్మించే ఎస్టీపీ కేంద్రం వరకు పైపులైన్ వేయనున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న కాలనీలన్నింటి మురుగు పంజాబ్‌చౌక్ నుంచి మహాలక్ష్మీవాడవైపు వెళ్తుండటంతో ఈ మార్గాన్ని ఆ ఎస్టీపీకి అనుసంధానించనున్నారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు, రవీంద్రనగర్, శాంతినగర్ వంటి కాలనీల నుంచి వచ్చే మురుగు ఖానాపూర్ చెరువులో నిర్మించే ఎస్టీపీకి మళ్లించనున్నారు. కేఆర్‌కే, ఇందిరమ్మకాలనీ, బంగారుగూడలోనూ చుట్టుపక్కల కాలనీలను కలిపి పైపులైన్ వేస్తారు. ఇలా అయిదు ఎస్టీపీలు వాటి కోసం నిర్మించే 14 కిలోమీటర్ల మేర ఉండనున్న పైపులైన్ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి.

ప్రతిపాదనలు పంపించాం

ఎస్టీపీల నిర్మాణాలకు సంబంధించి నాలుగు చోట్ల స్థలాలను గుర్తించాం. వాటికి భూ సేకరణ చేయాల్సి ఉంది. రెవెన్యూ శాఖ ద్వారా భూములను సేకరించేందుకు అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. భూ సేకరణ ప్రక్రియ ఎప్పుడు పూర్తయితే అప్పుడే పనులు ప్రారంభిస్తాం.

– ఎం.గంగాధర్, పబ్లిక్ హెల్త్ ఈఈ

జిల్లాలో ఎస్సైల బదిలీలు

- 11 మందికి స్థానచలనం
- 10 మంది ప్రొబేషనరీలకు ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు
- ఎస్పీ ఉత్తర్వులు జారీ

ఎస్సై పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీస్థానం
ఏ.తిరుపతి	ఇచ్చోడ	డీఎస్‌బీ,అటాచ్డ్ టుటౌన్
వి పురుషోత్తం	జైనథ్	ఇచ్చోడ
పి. దివ్యభారతి	బేల	తాంసి
కే. నాగనాథ్	వీఆర్ ఆదిలాబాద్	బేల
డి. రాధిక	తాంసి	తలమడుగు
పి గౌతమ్	గుడిహత్నూర్	జైనథ్
బి. అంజమ్మ	తలమడుగు	డీఎస్‌బీ, అటాచ్డ్ వన్‌టౌన్
డి. శివరాం	సిరికొండ	ఆదిలాబాద్ టుటౌన్
జి. అప్పారావు	ఆదిలాబాద్	ఉట్నూర్ పోలీస్‌స్టేషన్ అటాచ్డ్
డి. పద్మ	వన్‌టౌన్ పోలీస్	ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ అటాచ్డ్
కే. రవీందర్	ఆదిలాబాద్ టుటౌన్	మావల పోలీస్‌స్టేషన్ అటాచ్డ్

ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించనున్న ప్రొబేషనరీ ఎస్సైలు

పేరు	పోలీస్‌స్టేషన్
కొమ్ము అఖిల్	నార్నూర్
గద్దం రమ్య	జైనథ్
బోడ పీర్‌సింగ్‌నాయక్	భీంపూర్
ఎస్ శ్రీ సాయి	సిరికొండ
పిల్లి ప్రణయ్ కుమార్	మావల
సతలపల్లి పూజ	ఉట్నూర్
జి. సంజయ్ కుమార్	ఇచ్చోడ
కోట రాజశేఖర్ రెడ్డి	బజార్‌హత్నూర్
ఎస్ జీవన్ రెడ్డి	గాదిగూడ
యనకి మధు కృష్ణ	గుడిహత్నూర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న 11 మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. అలాగే 10 మంది ప్రొబేషనరీ ఎస్సైలు ఎస్‌హెచ్‌వోలుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొబేషనరీ ఎస్సైలకు నెల పాటు ఎస్‌హెచ్‌వోగా శిక్షణ ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. బదిలీ అయిన ఎస్సైల వివరాలు.

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గం



అభివాదం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా నూతన కార్యవర్గాన్ని స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎస్.అశోక్, సెక్రటరీ జనరల్‌గా కే.శివకుమార్, అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా కే. కృష్ణ కుమార్, కోచైర్మన్లుగా కె.కిష్టన్న, మూగ శ్రీనివాస్, సాగల సుదర్శన్, ఎం.శ్రీనివాస్, కే.లక్ష్మారెడ్డి, బి.ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్లుగా ఆర్.శివకుమార్, నవీన్‌యాదవ్, కాంబ్లీ విజయ్ కుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా నవీన్ కుమార్, రాథోడ్‌రామారావు, కాంబ్లీ విజయ్ కుమార్, సెక్రటరీలుగా సప్దార్‌అలీ, జాయింట్ సెక్రటరీగా తిరుమల్‌రెడ్డి, కృష్ణ,సంజీవరెడ్డి ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

దారి దోపిడీ కేసులో నలుగురు అరెస్ట్

ఇచ్చోడ: దారి దోపిడీ కేసులో ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ తెలిపారు. ఈమేరకు శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీన హర్యానా దాబా వద్ద ఆగి ఉన్న లారీ అద్దాలను పగలగొట్టి డ్రైవర్ వద్ద నుంచి రూ.6500లు దారిదోపిడీ చేసినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఫుర్ఖన్ అలీ ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు పేర్కొన్నారు. దారి దోపిడికి పాల్పడిన ఇచ్చోడకు చెందిన డ్రైవర్ షేక్ సోహెలుద్దీన్, అడేగామ గ్రామానికి చెందిన సలాం శ్రావణ్‌కుమార్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన షేక్ రహిల్ అలియాస్ షేక్ గఫార్, సిరిచెల్మ గ్రామానికి చెందిన అబ్దుల్ యాసిర్‌లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

దహెగాం: మండలంలోని బొర్లకుంట గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయ స్వామి ఆలయం తలుపులు పగులగొట్టి ఆలయంలో ఉన్న 15 తులాల వెండి కిరీటం, 1 గ్రాము బంగారం దొంగతనం చేశారు. ఆలయ పూజారి నరేందర్ చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని మల్లాపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన మెరుగు గంగాధర్ పని నిమిత్తం శనివారం పార్‌పెల్లి నుంచి లక్ష్మణచాందకు వెళ్లాడు. మధ్యాహ్నా సమయంలో తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బైకు అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో తల, ముక్కుకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పోలీసు విధులకు ఆటంకం.. వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌లో వన్‌టౌన్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. అటువైపుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన పట్టణంలోని మోచిగల్లికి చెందిన గటిక ముఖేశ్‌ను ఆపగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా ఎస్సైతో వాగ్వాదానికి దిగడంతో పాటు వారి విధులకు ఆటంకం కలిగించాడు. అతడికి పరీక్షలు చేయగా మద్యం సేవించినట్లు తేలింది. దీంతో సదరు వ్యక్తిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15188]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662 [SCA25003196]

■ తెలంగాణ, ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్రలలో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్వహిస్తున్న PVR Projects సంస్థలో పనిచేయుటకు సైట్ అకౌంటెంట్స్ (B.Com), నీటిపారుదల ప్రాజెక్ట్‌లో అనుభవం ఉన్న సైట్ సూపర్ వైజర్స్ మరియు డ్రైవర్స్ (HMV & LMV) కావలెను. Contact No. 040 23338080, 80195 38080 Email: adm.vineela@gmail.com [H-804894]

గమనిక


సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

రైలు ఎక్కేద్దాం.. భారత్ చుట్టేద్దాం

- వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక టూర్లు
- దర్శనీయ స్థలాలకు ప్యాకేజీలు
- అందుబాటులోకి తెచ్చిన ఐఆర్‌సీటీసీ

వేసవి సెలవులు వచ్చేశాయి. చాలామంది సెలవుల్లో సరదాగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించాలనుకుంటారు. కొత్తగా వివాహం చేసుకున్న జంటలతో పాటు యువత, కొందరు కుటుంబ సమేతంగా కొత్త ప్రదేశాలకు వెళ్లాలని ఆసక్తి చూపుతుంటారు. కాగా మన దేశంలో ఎన్నో చూడదగిన పర్యాటక, చారిత్రక ప్రాంతాలు, ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో దేవాలయాలు, చారిత్రాత్మక ప్రదేశాల సందర్శనకు రైల్వేశాఖ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందిస్తోంది. అందుబాటు ధరల్లో నూతన పర్యాటక ప్రాంతాల్లో ఉల్లాసంగా గడపాలనుకునే వారి కోసం పలు ప్రత్యేక టూర్ ప్యాకేజీలు ప్రకటించింది.
– ఆదిలాబాద్


తాజ్‌మహల్


అరుణాచల దేవాలయం

- ఉత్తర భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే వారి కోసం అయోధ్య –కాశీ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ ద్వారా 10 రోజుల్లో ఆరు క్షేత్రాలను సందర్శించవచ్చు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఈ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించగా, ఇందులో పూరి జగన్నాథ స్వామి ఆలయం, కోణార్క్ సూర్యదేవాలయం, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లను దర్శించుకోవచ్చు. ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుంది. రూ.16,800 నుంచి ప్యాకేజీ ధర ప్రారంభం కానుంది.
- గంగా –రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట వారణాసి, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగ్ రాజ్, శృంగ్వేర్‌పూర్ ప్రాంతాలను సందర్శించేలా మరో ప్యాకేజీ సైతం ఉంది. జూన్ 14వ తేదీన సికింద్రాబాద్ నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్రకు రూ.16,200 నుంచి ప్యాకేజీ ధర ప్రారంభం కానుంది. తొమ్మిది రోజులపాటు ఈ యాత్ర ఉండనుంది.
- దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే వారికోసం దివ్య దక్షిణ యాత్ర –జ్యోతిర్లింగం పేరిట మరో ప్రత్యేక టూరిస్ట్ ప్యాకేజీ ఉంది. మే 22వ తేదీ నుంచి సికింద్రాబాద్ నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర 9 రోజులపాటు కొనసాగనుంది. ఈ యాత్రలో భాగంగా అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనంతపురం, తిరుచ్చి, తంజావూరు వంటి దక్షిణ భారతంలోని అన్ని ప్రముఖ దివ్య క్షేత్రాలను దర్శించుకోవచ్చు. ప్యాకేజీ ధర రూ.14,700గా ఉంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ ద్వారా ఈ యాత్ర కొనసాగనుంది.
- భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చరిత్రను తెలియజేసే ప్రముఖ దర్శనీయ స్థలాలతో పాటు జ్యోతిర్లింగాలను దర్శించాలనుకునే వారికోసం అంబేడ్కర్ యాత్ర –5, జ్యోతిర్లింగాల దర్శనం పేరిట మరో టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి జూన్ 3వ తేదీన ప్రారంభం కానున్న ఈ యాత్ర 9 రోజులపాటు కొనసాగనుంది. యాత్రలో భాగంగా నాగ్‌పూర్‌లోని దీక్ష భూమి, ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగాలు, అంబేడ్కర్ జన్మ భూమి –మౌ, నాసిక్ త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర జ్యోతిర్లింగం, ఛత్రపతి శంభాజీ నగర్లోని గ్రుశ్నేశ్వర్ జ్యోతిర్లింగాలు దర్శించుకోవచ్చు. ప్యాకేజీ ధర రూ. 14,700గా ఉంది.
- ఇక కలియుగ ప్రత్యక్ష దైవం తిరుపతి, శ్రీకాళహస్తి దివ్య క్షేత్రాలను దర్శించాలనుకునే యాత్రికులకు ప్రతీ గురువారం కరీంనగర్ నుంచి ప్రత్యేక రైలు సౌకర్యం అందుబాటులో ఉంది. నాలుగు రోజులపాటు ఉండనున్న ఈ యాత్రలో రూ.7,250 నుంచి ప్యాకేజీ ధర ప్రారంభం కానుంది.
- తాజ్‌మహల్ వైభవం, దేశ రాజధాని ఢిల్లీ, పింక్ సిటీ జైపూర్ అందాలను వీక్షించాలనుకునే వారి కోసం గోల్డెన్ ట్రయాంగిల్ టూర్ ప్యాకేజీ ఉంది. సికింద్రాబాద్ నుంచి ప్రతీ బుధవారం ఈ ప్రత్యేక రైలు నడుస్తుంది. 9 రోజులపాటు ఉండనున్న యాత్ర ప్యాకేజీ ధర రూ. 26,800 నుంచి అందుబాటులో ఉంది.

బుక్ చేసుకోండి ఇలా..



దర్శనీయ ప్రాంతాలను సందర్శించాలనుకునేవారు www. irctctourism. com వెబ్‌సైట్ ద్వారా ముందస్తుగా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చు. వారికి నచ్చిన కేటగిరీలలో టికెట్లను బుక్ చేసుకునే అవకాశాన్ని ఐఆర్‌సీటీసీ కల్పించింది. మరిన్ని వివరాల కోసం 82879 32228, 92814 95845, 92814 95843 నంబర్లలో ఎస్ఎంఎస్, ఫోన్‌కాల్ ద్వారా సంప్రదించవచ్చు.

సికింద్రాబాద్ వెళ్లాలంటే..

ఈ టూర్ ప్యాకేజీలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ప్రత్యేక యాత్రలు చేయాలనుకునే ఔత్సాహికులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి బయలుదేరే కృష్ణ ఎక్స్‌ప్రెస్, ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ద్వారా సైతం సికింద్రాబాద్ చేరుకోవచ్చు. అదే విధంగా కరీంనగర్ నుంచి తిరుపతి, శ్రీకాళహస్తి వెళ్లాలనుకునే ప్రయాణికులకు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయి.

నకిలీ ధ్రువపత్రాల కేసులో విచారణ ముమ్మరం

- కూపీ లాగుతున్న పోలీసులు

ఇచ్చోడ: నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలతో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించిన ఘటనలో పోలీసులు లోతుగా కూపీ లాగుతున్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందే క్రమంలో ఇతర రాష్ట్రాల యువకులకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు ఇవ్వడంలో సహకరించిన స్థానికులపై దృష్టి పెట్టారు. ఉద్యోగాలు పొందిన 17 మంది కూడా ఇస్లాంనగర్ గ్రామాన్నే ఎంచుకోవడం వెనుక స్థానికుల సహకారం ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇస్లాంనగర్ గ్రామస్తులను ఇప్పటికే కొంత మందిని పిలిపించి విచారించారు. గత రెండు రోజుల క్రితం విచారణ అధికారి కాజల్‌సింగ్ ఇచ్చోడ సీఐ కార్యాలయంలో మీసేవ నిర్వాహకులను విచారించారు. ధ్రువపత్రాల జారీ కోసం దరఖాస్తుదారుల నుంచి తీసుకునే పత్రాలు, వాటి వివరాలు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని పరిశీలించారు. మీసేవ నిర్వాహకులు, తహసీల్దార్ కార్యాలయాల్లో మీసేవ పత్రాలు జారీ చేసే సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగుల మధ్య ఉండే సంబంధాలపై ఆరా తీసినట్లు సమాచారం. మండల కేంద్రంలో పలు కంప్యూటర్ సెంటర్లలో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసే వారిపై నిఘా ఉంచారు. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి నివాస ధ్రువీకరణ పత్రాలు పొందే విషయంలో ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల కోసం సాయం చేసినట్లు సమాచారం. ఆ దిశగా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. విచారణ అధికారి ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను 'సాక్షి' వివరణ కోరగా విచారణ కొనసాగుతుందని, లోతుగా, పకడ్బందీగా విచారణ చేస్తున్నామన్నారు.

మృతదేహం లభ్యం

బాసర: పోలీస్‌స్టేషన్ వెనుకాల గల ఆవులగుట్ట వద్ద దొర్లింగ స్వామి (46) మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఆవులగుట్ట వద్ద మిషన్ భగీరథ సిబ్బందికి ఒక మృతదేహం కన్పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆధార్‌కార్డు ఆధారంగా మృతదేహం మహారాష్ట్రకు చెందిన దొర్లింగస్వామిదిగా గుర్తించారు. దొర్లింగ స్వామి తమ్ముడు శివానంద స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్సై సంజీవ్ తెలియజేశారు. కాగా మతిస్థిమితం లేని దొర్లింగ స్వామి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని పూలాజీబాబానగర్‌లో మండాలి బక్కన్న ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పూలాజీబాబా నగర్‌కు చెందిన మండాలి బక్కన్న కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మహారాష్ట్రలోని తమ బంధువుల ఇంటికి శుభ కార్యానికి వెళ్లాడు. రాత్రి 10.30 గంటలకు వచ్చి చూడగా, ఇంటి తలుపు తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి రెండు తులాల బంగారం, రూ.లక్ష 50వేల నగదు దొంగతనం చేసినట్లు గుర్తించారు. దొంగలు ఇంటి వెనుకవైపు ఉన్న కిటికీ నుంచి పారిపోయారని తెలిపారు. ఎస్సై సాయన్న అక్కడికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే ప్రత్యేక పోలీసు బృందం రప్పించి దర్యాప్తు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దొంగలు పగులగొట్టిన బీరువా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై మన్నూర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని నొవాడకు చెందిన దీపక్ (25), మిత్రుడు నితీశ్ ఇద్దరు కలిసి హైదరాబాద్ నుంచి మోటార్ సైకిల్‌పై నాగ్‌పూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మన్నూర్ జాతీయ రహదారి పక్కన నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ప్రమాదంలో దీపక్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన నితీశ్‌ను పోలీసులు అంబులెన్సులో రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.


ఘటనా స్థలం వద్ద దీపక్ మృతదేహం

జోరుగా మామిడి క్రయవిక్రయాలు

- బెల్లంపల్లి మ్యాంగో మార్కెట్‌లో సందడి
- గత నెల 28న మార్కెట్ ప్రారంభం
- రైతులకు తగ్గిన రవాణా భారం
- కమీషన్ ఏజెంట్లతో కొనుగోళ్లు చేస్తున్న నాగ్‌పూర్ వ్యాపారులు
- బాక్స్‌ల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి


మామిడి కాయలను తూకం వేస్తున్న సిబ్బంది


మార్కెట్‌లో కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మ్యాంగో మార్కెట్‌లో మామిడికాయల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే గడ్డం వినోద్ గత నెల 28న మార్కెట్‌ను లాంఛనంగా ప్రారంభించగా చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌లో మామిడికాయల అమ్మకాలు సాగిస్తున్నారు. రోజువారీగా క్వింటాళ్ల కొద్ది మామిడికాయలు మ్యాంగో మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న దశేరి, బంగెనపల్లి, హిమాయతి, మల్లిక, తోతపురి తదితర రకాల మామిడి కాయలు లభిస్తున్నాయి. స్థానిక ట్రేడర్స్‌తో పాటు నాగ్‌పూర్‌కు చెందిన బడా వ్యాపారులు కొందరు కమీషన్ ఏజెంట్లను పంపించి కాయల కొనుగోళ్లు చేపడుతున్నారు. కొనుగోలు చేస్తున్న మామిడి కాయలను మార్కెట్‌లో కూలీలతో గ్రేడింగ్ చేయించి బాక్స్‌ల్లో ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయించి నాగ్‌పూర్, అమరావతి, మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అమ్మకం, కొనుగోలు దారులతో మ్యాంగో మార్కెట్ సందడిగా మారింది. స్థానికంగా మామిడి కొనుగోళ్లు జరుగుతుండటంతో రైతాంగానికి రవాణా భారం గణనీయంగా తగ్గింది.

దళారుల ప్రమేయం లేకుండా..

మామిడి రైతులు దశాబ్దాల నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి మామిడి కాయల అమ్మకాలు సాగించేవారు. అక్కడ బడా వ్యాపారులు, దళారులు కుమ్మక్కై మద్దతు ధర దక్కకుండా చేసి రైతులను తీవ్రంగా వంచించేవారు. మార్కెట్ ఆవరణలోకి మామిడికాయలతో అడుగు పెడితే చాలు మద్దతు ధర రాకున్నా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. మార్కెట్‌కు శిస్తు కట్టడంతో పాటు పంట ఉత్పత్తులు అమ్మి పెట్టినందుకు దళారికి కమిషన్ చెల్లించుకోవాల్సి వచ్చేది. కానీ బెల్లంపల్లి మార్కెట్‌లో దళారుల ప్రమేయం లేకుండా, మోసాలకు తావులేకుండా పంటను అమ్ముకునే సౌకర్యం కలిగింది. మద్దతు ధర లేకుంటే పంటను మరోప్రాంతానికి తీసుకెళ్లి అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ మామిడి కాయల క్రయవిక్రయాలు జరుగుతుండటంతో మ్యాంగో మార్కెట్‌కు కళ వచ్చింది.

గత ఆరురోజుల్లో మామిడికాయల విక్రయాల వివరాలు..

మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మామిడికాయలు	3,000 క్వింటాళ్లు
చెల్లించిన మద్దతు ధర	రూ.21,000 (కనిష్ఠం), రూ.53,000 (గరిష్ఠం)
అమ్మకానికి తెస్తున్న మామిడి రకాలు	దశేరి, బంగెనపల్లి, హిమాయతి, మల్లిక, తోతపురి
పంట అమ్మకానికి తీసుకొచ్చిన రైతులు	165 మంది

కోరిక నెరవేరింది..



మ్యాంగో మార్కెట్ ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం. ఇన్నాళ్లకు మా కోరిక నెరవేరింది. ఇప్పటివరకు నాగ్‌పూర్‌కు పంటను తీసుకెళ్లి నష్టాల పాలయ్యాం. రవాణా చార్జీలు భారంగా ఉండేవి. కానీ ప్రస్తుతం బెల్లంపల్లి మార్కెట్ ఆ బాధలు తప్పాయి. నాగ్‌పూర్ మార్కెట్ కన్నా బెల్లంపల్లి మార్కెట్ చాలా నయం.– బాబా, గుత్తేదారు, బెల్లంపల్లి

మద్దతు ధర కల్పించాలి



మామిడి తోటలపై ఎన్నో ఆశలు పెంచుకున్న రైతులకు ఏటా మద్దతు ధర దక్కడం లేదు. వ్యాపారులు, దళారులు మోసం చేస్తున్నారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలు కురిసి పంట నేలపాలై నష్టపోతున్నాం. మరోవైపు మద్దతు ధర రాక మరిన్ని కష్టాలు అనుభవిస్తున్నాం. రైతులు నష్టాల పాలు కాకుండా మామిడికి గిట్టుబాటు ధర దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– రాజన్న యాదవ్, రైతు, పాట్యాల

చేపల వల చుట్టుకొని జాలరి మృతి


బసవరాజ్ (ఫైల్)

సోన్: చేపల వేటకు వెళ్లి వల చుట్టుకుని జాలరి మృతి చెందిన ఘటన గాంధీనగర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన సాలోకె బసవరాజ్ (47) శుక్రవారం రోజూ మాదిరి తెప్ప తీసుకుని చేపలు పట్టడానికి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ఆరా తీశారు. ఈక్రమంలో శనివారం ప్రాజెక్టు నీళ్లలో కాళ్లకు చేపల వల చుట్టుకొని ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. బసవరాజ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కే.గోపి తెలిపారు. బసవరాజ్‌కు ఒక కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

జంట ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సీసీఐ టౌన్‌షిప్‌లో ఓ జంట గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం గడ్‌చందాకు చెందిన ఓ యువతి, బాలరాజు ఇదివరకే ప్రేమించుకున్నారు. గతేడాది నవంబర్‌లో బాలరాజు పెళ్లికి నిరాకరించగా లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి బాలరాజును రిమాండ్‌కు తరలించారు. నెల రోజులపాటు జైలులో రిమాండ్ ఖైదీగా ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇదిలా ఉండగా ఆ యువతికి నాలుగు రోజుల క్రితం మామడ మండలం బండల ఖానాపూర్‌కు చెందిన యువకుడితో వివాహం జరిగింది. శనివారం తల్లిగారింటి నుంచి అత్తగారింటికి వెళ్లే క్రమంలో నిర్మల్ పట్టణానికి చేరుకున్నాక తనకు పని ఉందని కొద్దిసేపు ఇక్కడే ఉండమని భర్తకు చెప్పి అక్కడి నుంచి ప్రియుడితో కలిసి ఆదిలాబాద్‌కు వచ్చింది. పట్టణంలోని సీసీఐ టౌన్‌షిప్‌లో సాయంత్రం నాలుగు గంటలకు వెంట తెచ్చుకున్న గడ్డిమందును ఇద్దరు కలిసి తాగారు. అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది వారిని గమనించి 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్‌ను సంప్రదించగా.. జంట ఆత్మహత్యకు యత్నించగా రిమ్స్‌లో చేర్పించినట్లు పేర్కొన్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు.

'దేశవ్యాప్త సమ్మెతో కేంద్రానికి గుణపాఠం చెప్పాలి'

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేలా ఈనెల 20న జరగబోయే సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అంబాల ఓదెలు, రాజశేఖర్‌లు పిలుపునిచ్చారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం నరేందర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా తయారు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మెకు జేఏసీ పిలుపునిచ్చిందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు ధన్‌రాజ్, గోపాల్, ప్రభాకర్, కాంట్రాక్టు కార్మికులు శారద, అనిత తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం కార్యక్రమానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. మే 1 నుంచి 31వరకు ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడా శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలు గుట్కా, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామస్తులు, యువత, మహిళల ఆధ్వర్యంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషాలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్ర, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, పార్థసారథి, గ్రామ పటేల్ వెంకట్‌రావ్, బాదిరావ్, ఆనంద్‌రావ్ తదితరులు ఉన్నారు.


క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా

పాఠశాలల అభివృద్ధికి 'కడేర్ల' సూచనలు

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కడేర్ల రంగయ్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సూచనలు, సలహాలు ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐలో గత మూడు రోజులుగా 33జిల్లాల డీఈవోలకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లోని హెచ్‌ఎంలకు పాఠశాలల అభివృద్ధిపై మాట్లాడేందుకు అవకాశం కల్పించగా.. అందులో రంగయ్య ఒకరు కావడం గమనార్హం. ఆదివారం ఆయన బడిలో విద్యార్థుల సంఖ్యను 55నుంచి 200కు పెంచడం, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, డిజిటల్ తరగతులు, పదేళ్లుగా ఉచితంగా తన సతీమణి కడేర్ల వీణ విద్యాబోధన చేయడం, సూపర్ 100 విద్యార్థులతో విద్యాబోధన, ఎఫ్ఎం సావర్‌ఖేడా రేడియో స్టేషన్ ఏర్పాటు, పాఠశాల అభివృద్ధికి సొంతంగా రూ.లక్ష, గ్రామస్తులు, తల్లిదండ్రులు, దాతల విరాళాల సేకరణ, గ్రామంలో మద్యపాన నిషేధం కోసం ధర్నా చేపట్టడం, రంగయ్యను ప్రేరణాత్మక కథనంతో పోల్చి 'సర్' చిత్ర నిర్మాతలు రూ.3లక్షలు విరాళం అందజేయడం తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమాలపై పాఠశాల విద్య డైరెక్టర్ నరసింహారెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి యోగితారాణా, జేడీ రాజీవ్, ఆర్జేడీ సత్యనారాయణ తదితరులు రంగయ్యను అభినందించారు. పాఠశాలల అభివృద్ధికి మీ అనుభవాలు, సేవలు ఎంతో అవసరమని కొనియాడారు.


పవర్‌పాయింట్ ద్వారా పాఠశాల అభివృద్ధిని వివరిస్తున్న హెచ్ఎం కడేర్ల రంగయ్య